సాక్షి వికారాబాద్

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



అభివృద్ధికి రూ.10 కోట్లు

తండాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



దైవభక్తి కలిగి ఉండాలి

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని కర్ణాటక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శివరాజ్ పాటిల్ అన్నారు. 8లో▸



భరోసా.. అరకొర!

రైతు భరోసా పథకం గందరగోళంగా మారింది. డబ్బులు జమకాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అనాథ చిన్నారుల పేరిట రూ.9.50 లక్షల ఎఫ్‌డీ



బ్యాంకు పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

దౌల్తాబాద్: పిడుగుపాటుకు మృతి చెందిన కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని గోకఫసల్‌వాద్ గ్రామానికి చెందిన దంపతులు గోవిందమ్మ, వెంకటప్పలు 2017లో పిడుగుపాటుకు మృతి చెందారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు శనివారం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.9.50లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బ్యాంకు పుస్తకాలను కలెక్టర్ ప్రతీక్ జైన్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిక్స్‌డ్ డిపాజిట్ డబ్బుపై వచ్చే వడ్డీని పిల్లల చదువులకు వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్పాన్సర్ స్కీం కింద ప్రతీ నెల రూ.4వేలు ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. అనంతరం చిన్నారులకు నోట్‌బుక్స్, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ ఉమా హారతి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరి, చిన్నారుల నానమ్మ బాలమ్మ తదితరులు ఉన్నారు.

ఏఆర్ పోలీసులకు మొబిలైజేషన్ శిక్షణ



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: పోలీసులు విధుల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. వికారాబాద్‌లోని జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఏఆర్ పోలీసులకు 15 రోజుల మొబిలైజేషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించి మాట్లాడారు. పోలీసులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రాథమిక శిక్షణలో నేర్చుకున్న విషయాలను గుర్తు చేసుకోవాలన్నారు. పోలీసులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకునే అలవాటు చేసుకోవాలన్నారు. తమ విధులకు సంబంధించిన అన్ని విషయాలను మరోసారి క్లుప్తంగా నేర్చుకోవాలని, ప్రతీ ఒక్కరు క్రమశిక్షణతో ఉంటూ తమ ఆర్యోగాన్ని కాపాడుకుంటూ శాంతి భద్రతల రక్షణలో తమ పాత్రను పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ టి.హనుమంతరావు, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్‌ఐలు డేవిడ్, అజయ్, అంజత్ పాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైట్ వాచ్‌మెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బంట్వారం: బంట్వారం కేజీబీవీలో నైట్ వాచ్‌మెన్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానికులైన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. పదో తరగతి చదివి 25 నుంచి 55 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. ఏదైనా సెక్యూరిటీ ఏజెన్సీ నుంచి శిక్షణ పొంది ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 18లోగా మానవ వనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏసీబీకి పట్టుబడిన ఎస్‌ఐ వేణుగోపాల్ సస్పెండ్

ధారూరు: ఏసీబీకి పట్టుబడిన ధారూరు ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం హైదరాబాద్ మల్టీజోన్–2 ఐజీపీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. ఈ తాఖీదులు జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరాయి. ఓ కేసులో స్టేషన్ బెయిల్ ఇప్పించేందుకు రూ.50వేల లంచం మాట్లాడుకుని రూ.30వేలు తీసుకుంటూ ఈ నెల 11న ఏసీబీకి చిక్కిన విషయం విదితమే. ఈ మేరకు ఏసీబీ అధికారులు ఎస్‌ఐను నాంపల్లి కోర్టు లో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ జైలుకు వెళ్లడంతో ఆయనపై వేటుపడింది.

నేటి నుంచి 'కులగణన'

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సమగ్ర కుటుంబ/కులగణన సర్వేలో పాల్గొనని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు వివరాలు నమోదు చేయనుంది. టోల్ ఫ్రీ నంబర్ సహా ఆన్‌లైన్‌లో ఫాం డౌన్‌లోడ్ చేసుకుని, వివరాలన్నీ పూర్తి చేసి ఇవ్వొచ్చు. మున్సిపాలిటీలు/ మండల కేంద్రాల్లో ఎంపిక చేసిన 37 ప్రజా పాలన సేవా కేంద్రాలకు నేరుగా వెళ్లి వివరాలు సమర్పించొచ్చని రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సండే స్పెషల్

రేసుకు రెడీ





హార్స్ రేస్‌కు శంకర్‌పల్లి మండలం జన్వాడ వేదిక కానుంది. ఇక్కడి నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్ ఆతిథ్యమివ్వనుంది. 22, 23 తేదీల్లో 'జూనియర్ నేషనల్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్ షిప్–2025' (అర్హత పోటీలు)కు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు ఆయా విభాగాల్లో తలపడనున్నారు.

– శంకర్‌పల్లి


గుర్రపు స్వారీ.. చూసొద్దామా మరి

- ఈక్వెస్ట్రియన్ చాంపియన్ షిప్-2025కు అంతా సిద్ధం
- వేదిక కానున్న శంకర్‌పల్లి మండలం జన్వాడ
- అతిథ్యమివ్వనున్న నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్
- దేశం నలుమూలల నుంచి పాల్గొననున్న హార్స్ రైడర్లు

జన్వాడలోని నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌ని 1988లో హైదరాబాద్ నవాబ్‌లకు చెందిన మీర్ అహ్మద్ ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. మీర్ అహ్మద్ 60 ఏళ్ల క్రితమే ఖైరతాబాద్‌లో బాలికల, గచ్చిబౌలిలో బాలుర పాఠశాలలను ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించి, విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పోటీలకు పంపాలన్న ఉద్దేశంతో నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌కు శ్రీకారం చుట్టారు. క్లబ్‌లో దాదాపు 40కి పైగా శిక్షణ పొందిన గుర్రాలు, నిష్ణాతులైన కోచ్‌లను ఏర్పాటు చేశారు. పోలో కోసం ప్రత్యేకంగా సిలికా ఎరినా (గ్రౌండ్) అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దారు. రాత్రి సమయంలోనూ శిక్షణ పొందేందుకు ఫ్లడ్ లైటింగ్ సిస్టం సైతం ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో మొత్తంగా ఆరు క్లబ్‌లు ఉండగా జన్వాడలోని క్లబ్ ఒకటి కావడం విశేషం.

ఈనెల 22,23 తేదీల్లో అర్హత పోటీలు

జూనియర్ నేషనల్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్–2025 పోటీల కోసం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జన్వాడలోని నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌లో ఈ నెల 22,23 తేదీల్లో జాతీయ అర్హత పోటీలు నిర్వహించనున్నారు. దేశంలో గుర్తింపు పొందిన హార్స్ రైడింగ్ క్లబ్బుల నుంచి అండర్ –11, అండర్–14, అండర్–18 కేటగిరీల్లో ఉన్న హార్స్ రైడర్స్ మాత్రమే పాల్గొంటారు. పోటీలకు వచ్చే రైడర్లు, అతిథుల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్కో రైడర్ ఒక్కోసారి మాత్రమే (నాకౌట్) పోటీ పడేందుకు అవకాశం ఉంటుంది. అర్హత పోటీల్లో గెలుపొందిన విజేతలు ఢిల్లీలో నిర్వహించే చాంపియన్‌షిప్ –2025 ఫైనల్స్‌లో తలపడతారు. ఈక్వెస్ట్రియన్‌లో మొత్తం మూడు విభాగాలు (పోలో, షో జంపింగ్, డ్రెసాజ్) ఉంటాయి.



గుర్రాలను నిలిపి ఉంచే (స్టేబుల్) కేంద్రం

గుర్రాలు లేనివాళ్లకు రెంటుకు

జాతీయ అర్హత పోటీల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున హార్స్ రైడర్లు వచ్చే అవకాశం ఉంది. కొందరు తమ సొంత గుర్రాలను తెచ్చుకోవడంలో ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారి కోసం తమ వద్ద ఉన్న గుర్రాలను రోజుకు రూ.1000 అద్దె చెల్లించి, పోటీలకు వినియోగించుకోవచ్చని నాసర్ పోలో నిర్వాహకులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చే గుర్రాలకు ప్రత్యేకమైన స్థలాన్ని 'స్టేబుల్' అనే పేరుతో కేటాయించారు.



షో జంపింగ్, డ్రెసాజ్‌ల కోసం సిద్ధం చేసిన మట్టి కోర్టు

పోలో: సిలికా ఎరినా (గ్రౌండ్)లో నిర్వహిస్తారు. ఈ విభాగంలో మొత్తం రెండు జట్లు పోటీ పడతాయి. ఒక్కో జట్టులో ముగ్గురు రైడర్లు ఉంటారు. ఒక్కో గేమ్ 7 నిమిషాల పాటు సాగుతుంది. మూడున్నర నిమిషాలకోసారి విరామం ఇస్తారు.

షో జంపింగ్: మట్టి కోర్టులో నిర్వహిస్తారు. ఈ విభాగంలో ఒక్కో రైడర్ మాత్రమే పోటీ పడతారు. 5 నిమిషాల పాటు సాగే ఈ గేమ్‌లో.. రెండున్నర నిమిషాలకు విరామం ఇస్తారు. హార్డిల్స్‌ని 60 సెం.మీ, 80 సెం.మీ, 100 సెం.మీ, 110 సెం.మీ ఎత్తులో ఉంచి, వాటి పై నుంచి గుర్రాలు జంప్ చేసేలా పోటీలు ఉంటాయి.

డ్రెసాజ్: మట్టి కోర్టులోనే నిర్వహిస్తారు. మార్చ్ ఫాస్ట్, గుర్రం, రైడర్ల నైపుణ్యం, కచ్చితత్వం వంటి వాటిపై పోటీ ఉంటుంది. ఈ గేమ్ 5 నిమిషాల పాటు సాగుతుంది. రెండున్నర నిమిషాలకు విరామం ఇస్తారు.

ప్రవేశం ఉచితం

జన్వాడలోని నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి అర్హత పోటీలు చూసేందుకు అభిమానులకు ఫ్రీ ఎంట్రీ అవకాశం కల్పించారు.



అవకాశం.. ఆనందం

ప్రతిష్టాత్మకమైన చాంపియన్‌షిప్–2025కి సంబంధించిన అర్హత పోటీలు మా క్లబ్‌లో నిర్వహించడం గర్వంగా ఉంది. ఈక్వెస్ట్రియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు ఉన్న క్లబ్‌లనే ఎంపిక చేస్తుండడంతో మాకు అవకాశం లభించింది. పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– మీర్ అహ్మద్, సీఈఓ, నాసర్ పోలో హార్స్ రైడింగ్ క్లబ్

సర్కారు బడులకు కాంట్రాక్టు టీచర్లు

- 2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగులు
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 219 మంది నియామకం
- ప్రాథమిక పాఠశాలల్లో వందశాతం ఖాళీలు భర్తీ
- ఫలించిన అభ్యర్థుల 17 ఏళ్ల పోరాటం

బషీరాబాద్: ప్రభుత్వం డీఎస్సీ 2008 అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇచ్చింది. దీంతో ఇక ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్టు టీచర్లు కొలువుదీరనున్నారు. 2008లో ఎస్‌జీటీ పోస్టుల భర్తీలో డీఎడ్ అభ్యర్థులకు 30శాతం వెయిటేజీ ఇవ్వడంతో అప్పుడు మెరిట్ జాబితాలో పేరున్నప్పటికీ 2,367 మంది ఉద్యోగానికి దూరమయ్యారు. దీంతో వారు అప్పటి నుంచి పోరాటాలు చేయడంతో 2024 ఫిబ్రవరిలో వీరిని కాంట్రాక్టు పద్ధతిన నియమించాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. ధర్మాసనం ఆదేశాలతో 1,375 మందిని అర్హత కలిగిన అభ్యర్థులుగా ప్రభుత్వం గుర్తించింది. వీరి నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి అభ్యర్థుల సర్టిఫికెట్లు సైతం వెరిఫికేషన్ చేసింది. పోస్టింగులు ఇవ్వడానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకులు ఉన్నాయని కొంత కాలయాపన చేయడంతో మరోసారి హైకోర్టు జోక్యం చేసుకుంది. ఎన్నికల కోడ్ ఎలాంటి అడ్డుకాదని చెప్పడంతో విద్యాశాఖ పోస్టింగుల ప్రక్రియను ప్రారంభించింది. దీంతో అభ్యర్థుల 17 ఏళ్ల పోరాటానికి ఫుల్‌స్టాప్ పడింది. ఇకపై కాంట్రాక్టు టీచర్లతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉన్న ఎస్‌జీటీ ఖాళీలన్నీ వంద శాతం పూర్తికానున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 219 మంది ఎస్‌జీటీ అభ్యర్థులకు శనివారం అధికారులు నియామక పత్రాలు అందజేశారు. వంద పోస్టుల్లో ముగ్గురికి ఉర్దూమీడియంలో పోస్టింగ్ ఇచ్చారు.

ఉద్యోగం రెన్యూవల్

కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన టీచర్లను ప్రతీ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం రెన్యూవల్ చేయనుంది. ఇందుకోసం వీరంతా ఏటా అగ్రిమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. వీరి వేతనం బేసిక్ స్కేల్ రూ.31,040గా నిర్ణయించింది. ఎలాంటి అలవెన్సులు వర్తించవని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇతర కాంట్రాక్టు ఉద్యోగుల మాదిరి సెలవులు మాత్రం వర్తించనున్నాయి. అయితే 17 సంవత్సరాల పాటు సర్వీసును కోల్పోయిన కాంట్రాక్టు టీచర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని వివిధ ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 2008 డీఎస్సీ అభ్యర్థుల ఉద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉద్యమాలు నడిపించిన వనపర్తి జిల్లాకు చెందిన శ్రీనివాస్ నాయక్‌ను వికారాబాద్ జిల్లాకు కేటాయించారు. ఈ మేరకు పీఆర్టీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్, అమర్‌నాథ్, శ్రీధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి వివిధ మండలాల అధ్యక్షులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాల వారీగా కేటాయించిన ఎస్‌జీటీ పోస్టులు

జిల్లా	పోస్టులు
వికారాబాద్	100
రంగారెడ్డి	99
మేడ్చల్ మల్కాజిగిరి	20



కాంట్రాక్టు టీచర్‌గా నియమితులైన 2008 డీఎస్సీ అభ్యర్థుల ఉద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్‌ను అభినందిస్తున్న పీఆర్టీయూ సంఘం నాయకులు

చురుగ్గా జాతర ఏర్పాట్లు



కొనసాగుతున్న హెలిపాడ్ పనులు

21న ముఖ్యమంత్రి రాక

దుద్యాల్: పోలేపల్లి ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 21న రానున్నారు. అందుకుగాను అధికారుల ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. శనివారం ఎస్‌ఐ యాదగిరి, ఆలయన చైర్మన్ జయరాములు, ఆర్‌అండ్‌బీ అధికారులు సురేందర్‌రెడ్డి పనులను పరిశీలించారు. హెలిపాడ్ పనులు, వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట ఆలయ కమిటీ సభ్యులు నర్సింలు, యాదయ్య, వెంకటయ్య గౌడ్, నర్సిములు, మునికుమార్, రాములు తదితరులు ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందరరాజన్

మొయినాబాద్ రూరల్: చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందరరాజన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆలయాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. నిజాం ప్రభుత్వం హయాంలో హైదరాబాద్ దేవాదాయ, ధర్మదాయ క్రమబద్ధీకరణ ప్రకారం కీ.శే. శఠగోపాలచారి చిలుకూరు బాలాజీ దేవాలయానికి హక్కుదారునిగా ఉన్నారని అన్నారు. తమ పూర్వీకుల నుంచి తరతరాలుగా తమ కుటుంబమే దేవాలయ నిర్వ హణ బాధ్యతలు చూస్తున్నామని గుర్తుచేశారు. దైవం అస్తిత్వాన్ని దెబ్బతీసే వారికి దేవాలయ నిర్వహణలో హక్కుకానీ దైవ సంబంధమైన అంశాలపై మాట్లాడే అర్హత కానీ లేవన్నారు.

ఆదిబట్లలో హైడ్రా మార్క్

అనుమతులు లేని హోర్డింగ్‌ల తొలగింపు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లలో హైడ్రా కొరడా ఝులిపించింది. అక్రమ హోర్డింగులపై కన్నెర్ర చేసింది. మున్సిపల్ పరిధిలో శనివారం హైడ్రా అధికారులు పర్యటించారు. కొంగరకలాన్, బొంగ్లూర్, ఎంపీ పటేల్‌గూడ, మంగళ్‌పల్లిలో అనుమతులు లేకుండా 16 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. వెంటనే సిబ్బందిని పిలిపించి హోర్డింగ్‌లను తొలగించారు. కొంగరకలాన్ అంబేడ్కర్ చౌరస్తా, కల్వకోలు లక్ష్మీదేవమ్మ ఫంక్షన్ హాల్ సమీపంలో, స్టేట్‌బ్యాంకు వద్ద, మంగళ్‌పల్లిలో ఉన్న హోర్డింగ్‌లను పూర్తిగా తీసివేశారు. కొన్నింటికి సాంకేతిక పరమైన చిక్కులు వచ్చాయని వదిలిపెట్టారు. మరికొన్ని హోర్డింగ్‌లను యాజమాన్యాలే స్వయంగా తొలగించుకోవడం విశేషం. మున్సిపల్ కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగానే హోర్డింగ్‌లు తొలగించినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని తెలిపారు.



కొంగరకలాన్‌లో హోర్డింగ్‌లు తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

ఎనిమి ఆస్తుల లెక్క తేల్చండి

- మార్చిలోగా సర్వే పూర్తి చేయండి
- సమగ్ర వివరాలు సమర్పించండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎనిమి ఆస్తుల (కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా (సెపీ) సంరక్షణలోని శత్రు ఆస్తుల) లెక్క మార్చిలోగా పక్కాగా తేల్చాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం హోటల్ టూరిజం ప్లాజాలో సీసీఎల్‌ఏ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్, వికారాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కొత్వాల్‌గూడలో 600 ఎకరాలకుపైగా, మియాపూర్‌లో 291 ఎకరాలకుపైగా ఉన్న ఎనిమి ప్రాపర్టీస్‌పై పురోగతి ఏమిటి అని కలెక్టర్ నారాయణ రెడ్డిని ప్రశ్నించారు. మార్చిలోగా సర్వే పూర్తి చేసి, వివరాలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ భూములను కాపాడాల్సిందే..

హైదరాబాద్ జిల్లా బాకారంలో 25,503 గజాల వివాదాస్పద స్థలంలో ఎనిమి ప్రాపర్టీస్ వాటా కింద ఉన్న 5,578 గజాలు, బహదుర్‌పురాలోని రికాబ్‌గంజ్‌లోని 710,724,778,784 సర్వే నంబర్లలో ఉన్న 3,300 గజాలు, కొత్తగూడెం పాల్వంచలోని సర్వే నంబర్లు 126/111, 126/112లోని 40 ఎకరాలు, వికారాబాద్ జిల్లా అల్లంపల్లి సర్వే నంబర్లు 426, 427, 428లో 17.22 ఎకరాలు ఎనిమి ప్రాపర్టీస్ ఉన్నట్లు రికార్డులు ఉన్నాయని అన్నారు. సెపీ అధికారులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి సెక్షన్ 8ఏ ప్రకారం వివాదాలను పరిష్కరించాలని సూచించారు. హైదరాబాద్ సహా రంగారెడ్డి ఇతర జిల్లాల్లోని ఎనిమి ఆస్తులు ఇప్పటికే పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయినట్లు ఆయా జిల్లాల అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాటిని కాపాడి తీరాల్సిందేనని మంత్రి ఆదేశించారు.



ఎనిమి ప్రాపర్టీస్ అంటే?

1962లో చైనీస్ దండయాత్ర, 1965 నుంచి 1971 వరకు జరిగిన ఇండో–పాక్ యుద్ధం అనంతరం భారత్ నుంచి వెళ్లిపోయి పాకిస్తాన్, చైనాలో స్థిరపడి ఆయా దేశాల పౌరసత్వం తీసుకున్న వ్యక్తులకు సంబంధించి భారత్‌లో ఉన్న ఆస్తులను శత్రు ఆస్తులుగా ప్రభుత్వం గుర్తించింది. వీటి సంరక్షణ బాధ్యతలను సెపీకి అప్పగించింది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 13 వేల వరకు శత్రు ఆస్తులున్నట్లు కేంద్రం వద్ద రికార్డులున్నాయి. వీటి మార్కెట్ విలువ రూ.వేల కోట్లు ఉన్నట్లు గుర్తించింది. ఎనిమి ప్రాపర్టీ చట్టంలోని సెక్షన్ 8 (ఏ) ప్రకారం ఈ ఆస్తులను విక్రయించే అధికారం కేంద్రానికి ఉంది. నాటి నుంచి నేటి వరకు ఈ ఆస్తులు చాలా చోట్ల అన్యాక్రాంతమయ్యాయి. ఆస్తుల వివాదాల పరిష్కారంపై బండి సంజయ్ సమీక్ష నిర్వహించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అనంతగిరి: వికారాబాద్ మండలం బురాన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పూర్ణచందర్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్రెపల్లి, శివారెడ్డిపేట, ధన్నారం, బురాన్‌పల్లిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

కుల్కచర్ల: మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముత్యాలయ్య రేకుల ఇల్లు దగ్ధమవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో విషయం తెలుసుకున్న పరిగికి చెందిన కళాకారుల బృందం వారికి అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుమ్మరి వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ముత్యాలయ్య కుటుంబానికి అగ్ని ప్రమాదంతో తీవ్రనష్టం వాటిల్లిందని.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం శ్రీశైలం, సత్యం, రవి, శంకర్, శ్రీను, రమేష్, రాజేందర్ యాదవ్, బాల్‌రాజ్, మైలారం శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం



కాలిపోతున్న గుడిసె

పరిగి: కులవృత్తి చేసుకునేందుకు నిర్మించుకున్న గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని రాండరెడ్డిపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి ముత్యాలమ్మ కుండలు తయారు చేసుకుంటూ జీవనం సాగించుకునేందుకు ఓ గుడిసె వేసుకుంది. ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకుని అందులోని సామగ్రి కాలిబూడిదైంది. దీంతో బాధితురాలు ప్రభుత్వమే తనను ఆదుకోవాలని వేడుకుటోంది.

రెండు గడ్డివాములు దగ్ధం



కాలిబూడిదైన గడ్డివాము

దుద్యాల్: పాడి పశువులకు కొనుగోలు చేసిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మాసుల వెంట్రాములు పొలం వద్ద పశువుల పాక ఏర్పాటు చేసుకుని పాడి గేదెలను సాకుతున్నాడు. వాటి మేత కోసం ఇతరుల నుంచి పశుగ్రాసం కొనుగోలు రెండు గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నాడు. పక్కనే గ్రామ పంచాయతీకి చెందిన డంపింగ్‌యార్డులో చెత్తను తగులబెట్టేందుకు సిబ్బంది నిప్పటించారు. ఈ మంటలు గడ్డివాముకు వ్యాపించి రెండు వాములు కాలిబూడిదయ్యాయి. గేదెల అరుపులు విన్న పక్కనే వ్యవసాయదారులు వాటిని వదిలిపెట్టడంతో ప్రమాదం తప్పింది. గడ్డి విలువ రూ.20వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

ప్రజలు తిరగబడటం ఖాయం

- ప్రభుత్వానికి ఆ రోజులు దగ్గరలోనే ఉన్నాయి
- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- కడ్తాల్‌లో పార్టీ నాయకుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: ప్రభుత్వంపై ప్రజలు తిరగబడటం ఖాయమని, ఆ రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని తన నివాసంలో శనివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 18న పార్టీ ఆధ్వర్యంలో ఆమనగల్లులో నిర్వహించనున్న రైతు దీక్షకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు మాయమాటలు, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఆ తర్వాత వాటిని విస్మరించిందని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థ విధానాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలో కాంగ్రెస్ సర్కార్ ముందుందని విమర్శించారు. చాలా గ్రామాల్లో రైతులకు రుణమాఫీ కాలేదని, రైతు భరోసా అందలేదని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ నెల 18న ఆమనగల్లు పట్టణంలో నిర్వహించనున్న రైతు దీక్షలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎద్మ సత్యం, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దశరథ్‌నాయక్, అనురాధ, విజితారెడ్డి, మాజీ ఎంపీపీలు నిర్మల, శ్రీనివాస్‌యాదవ్, రాంరెడ్డి, జైపాల్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, నాయకులు శంకర్, రాజేందర్‌యాదవ్, రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బిల్లు రాలేదు.. బడికి తాళం వేస్తా

- ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ భర్త హల్‌చల్
- ఎంఈఓ హామీతో సద్దుమణిగిన వివాదం



పాఠశాలకు తాళం వేసేందుకు వచ్చిన శ్రీనివాస్

తాండూరు రూరల్: చేసిన పనికి బిల్లులు రాలేదని, పాఠశాలకు తాళం వేస్తానని ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన శనివారం పెద్దేముల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బుద్దారం ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప భర్త శ్రీనివాస్.. అభివృద్ధి పనులు చేశాడు. నెలలు గడిచినప్పటికీ బిల్లులు రాలేదు. దీంతో పలుమార్లు శ్రీనివాస్.. ఎంపీడీఓ, ఎంఈఓ, హెచ్‌ఎంలను అడిగారు. అయినా ఫలితం లేకపోవడంతో బిల్లులు చెల్లించేంత వరకు పాఠశాలకు తాళం వేస్తానని తాళంతో వచ్చాడు. అక్కడే ఉన్న హెచ్‌ఎం వారించగా.. రూ.2 లక్షల వరకు పనులు చేస్తే కేవలం రూ.50 వేలు మాత్రమే వచ్చాయని వాపోయాడు. ఇదే విషయాన్ని హెచ్‌ఎం గాయత్రి ఎంఈఓకు సమాచారం ఇచ్చారు. అనంతరం ఎంఈఓ నర్సింగ్‌రావు.. శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బ్యాంక్ అకౌంట్ టెక్నికల్ సమస్య వలన నిధులు వెనక్కి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, మూడు రోజుల్లో డబ్బులు చెల్లిస్తామని శ్రీనివాస్‌కు ఎంఈఓ హామీ ఇచ్చారు. దీంతో శ్రీనివాస్ వెళ్లిపోయాడు.

కానిస్టేబుల్‌కు సన్మానం



కానిస్టేబుల్ జగదీశ్‌ను సన్మానిస్తున్న మూడో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌పాష

ఇబ్రహీంపట్నం: చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ప్రాణాలు కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్ కానిస్టేబుల్ జగదీశ్‌ను మూడో బెటాలియన్ అధికారులు శనివారం సన్మానించి, అభినందనలు తెలిపారు. ఇబ్రహీంట్నానికి చెందిన తాటిపల్లి అంజమ్మ(50) శుక్రవారం రాత్రి స్థానిక పెద్దచెరువులో దూకి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండటాన్ని గమనించిన జగదీశ్ వెంటనే చెరువులోకి దూకి ఆమెను రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చాడు. అనంతరం అక్కడున్న తోటి పోలీసులు వేణు, ప్రవీణ్, ముఖేష్, కార్తిక్, నాగులుతో ఆమెను కట్టపైకి తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఎంతో ధైర్యసహసాలతో మహిళను రక్షించిన జగదీశ్‌ను 3వ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ పాష, అడిషనల్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు, ఎస్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌చార్జి మహేశ్‌లు శాలువ కప్పి, సన్మానించి అభినందనలు తెలిపారు.

కుక్కను తప్పించబోయి.. డివైడర్‌ను ఢీకొట్టి

ద్విచక్ర వాహనం బోల్తా

- అక్కడికక్కడే వ్యక్తి మృతి

చేవెళ్ల: ముంబై లింక్ హైవేలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కుక్కను తప్పించబోయి బోల్తా పడ్డాడు. శుక్రవారం రాత్రి చేవెళ్ల దేవునిఎర్రవల్లి బస్టేజీ సమీపంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఎన్కేపల్లికి చెందిన బేగరి పాండు (35) వ్యవసాయంతో పాటు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ భార్యాపిల్లలతో కలిసి చేవెళ్లలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం స్వగ్రామానికి వెళ్లిన పాండు బైక్‌పై తిరిగి వస్తున్నాడు. దేవుని ఎర్రవల్లి స్టేజీ వద్దకు రాగానే అకస్మాత్తుగా రోడ్డు పైకి వచ్చిన కుక్కను తప్పించబోయి, బైక్ అదుపు తప్పి, డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడ్డాడు. తలకు బలమైన గాయంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులకు సంఘటన స్థలానికి వెళ్లి, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శనివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య పుష్ప, ఓ కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి



నరేందర్‌రెడ్డితో బుయ్యని

తాండూరు: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు క్రియాశీలకంగా పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ నియోజవకర్గ నాయకులు, ఆర్‌బీఎల్ పరిశ్రమ ఎండీ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి నగరంలో నరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలపై చర్చించారు. త్వరలో వరుసగా పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికలు వస్తాయని, సమష్టిగా పనిచేసి మెజార్టీ స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయాలని వేం సూచించారు.

వేరుశనగకు డిమాండ్

అత్యధికంగా క్వింటాల్‌కు రూ.6,670



ధారూరు వ్యవసాయ మార్కెట్లో నిర్వహిస్తున్న బీట్లు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్లో వేరుశెనగ ధర ప్రతీ వారం పెరుగుతూ వస్తుంది. రెండు వారాల క్రితం క్వింటాల్‌కు రూ.6,200 ఉండగా గత వారం 6,300 ధర పలికింది. శనివారం క్వింటాల్‌కు రూ.6,670 వరకు పెరిగింది. తక్కువగా క్వింటాల్‌కు రూ.5,600, మధ్యస్థంగా రూ.6,450, ఎక్కువగా రూ.6,670 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. కందులు క్వింటాల్‌కు రూ.7,300, 7,450, 7,510 వరకు అమ్మకాలు జరిగాయని మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



దోమ: చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కిష్టాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తి చెత్త సంచితో గ్రామ సమీపంలో నిద్రిస్తున్నాడు. గ్రామస్తులు ఆయన వద్దకు వెళ్లి వివరాలు అడగ్గా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో వారు 108కు ఫోన్ చేసి పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన శనివారం మృతి చెందాడు. కిష్టాపూర్ పారిశుద్ధ్య కార్మికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య వదిలి వెళ్లిందని..

మనస్తాపంతో భర్త ఆత్మహత్య

దుండిగల్: కుటుంబ కలహాల కారణంగా భార్య ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసు కుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తాండూరు మల్కాపూర్‌గని గ్రామానికి చెందిన నీలేశ్(24) కు ఆదే గ్రామానికి చెందిన పూజతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. బతుకు దెరుకు నిమిత్తం నగరానికి వలస వచ్చిన వారు డి.పోచంపల్లిలోని 60 గజాల్లో నివాసం ఉంటున్నారు. నీలేశ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పూజ ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికిలోనైన నీలేశ్ శనివారం మధ్యా హ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్నానానికి వెళ్లి.. చెరువులో పడి

ఆగిర్యాలలో వ్యక్తి దుర్మరణం

కొందుర్గు: స్నానం చేయడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన ఘటన మండలంలోని ఆగిర్యాలలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవీందర్ నాయక్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శంకరయ్య(30) శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆగిర్యాల శివారులోని చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి, అందులో పడిపోయాడు. గమనించిన స్థానికులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు చెరువు వద్దకు చేరుకొని గాలించగా మృతదేహం లభించింది. మృతుడి తల్లి పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో సాగర్ రోడ్డుపై ధర్నా

యాచారం: ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. మండల పరిధి మాల్ కేంద్రంలోని సాగర్ రోడ్డుపై శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని తాము వ్యతిరేకించడం లేదని, లక్షలాది రూపాయల అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసిన ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని తెలిపారు. వీరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈఎంఐలు చెల్లించడంతో పాటు, వడ్డీలేని రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. బతుకు భారమై ఎంతో మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, నాయకులు సతీష్, మహేశ్, శ్రీరాములు, రమేశ్ జంగయ్య పాల్గొన్నారు.



మాల్‌లోని సాగర్ రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, ఆటో డ్రైవర్ల యూనియన్ సంఘం నేతలు

తండాల అభివృద్ధికి రూ.10 కోట్లు

- సేవాలాల్ జయంతిలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



సేవాలాల్ జయంతిలో ఎమ్మెల్యే బీఎమ్మార్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు రూరల్: నియోజకవర్గ పరిధి తండాల్లో మలిక సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దేముల్ మండలం జైరాంతండాలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతిలో ఎమ్మెల్యే బుయ్యని, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన తాండూరు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ముఖ్యంగా తండాల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో అన్ని తండాల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజన యువతీ యువకులు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, చదువుకుంటేనే భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు బాబుసింగ్, రియాజ్, శోభారాణి, నర్సింహులు, రాములు, అనిల్ రాథోడ్, సుమిత్ర రాథోడ్, గోపాల్, జితేందర్‌రెడ్డి, మల్లేశం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వృక్షార్చనను జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు

కొడంగల్ రూరల్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 17న నిర్వహించనున్న 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' వృక్షార్చనను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఆయన వృక్షార్చన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ ఆధ్వర్యంలో హరితహారం ద్వారా తెలంగాణను పచ్చలహారంగా మార్చారని తెలిపారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలాని కోరారు. కార్యక్రమంలో హరితసేన జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, మాజీ కౌన్సిలర్ మధుయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, భీములు, నారాయణరెడ్డి, నరేష్‌గౌడ్, సోమనాథ్, రవిగౌడ్, తలారి మల్లేశ్, రాములు, మల్లేశ్‌గౌడ్, హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు పూజలు

పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ జాతరలో పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగిఉండాలి



దేవతామూర్తుల ఊరేగింపు

కర్ణాటక మంత్రి శివరాజ్‌పాటిల్



పూజల్లో పాల్గొన్న కర్ణాటక మంత్రి శివరాజ్‌పాటిల్

దౌల్తాబాద్: ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని కర్ణాటక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శివరాజ్ పాటిల్ అన్నారు. మండల పరిధి గోకఫసల్‌వాద్‌లో స్థానికులు రూ.కోటి వెచ్చించి నిర్మించిన శివాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి.. ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులను అభినందించారు. ఇదిలా ఉండగా ఉదయం ఆలయంలో దేవతామూర్తుల ఊరేగింపు, వేదపండితులు గణపతి ప్రతిష్ఠ, హోమం తదితర కార్యమాలను నిర్వహించారు. కార్యక్రమం మూడు రోజుల పాటు జరగనుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

- అది జీర్ణించుకోలేకే ప్రధానిపై సీఎం ఆరోపణలు
- కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు వెంకటయ్యగౌడ్



మాట్లాడుతున్న వెంకటయ్య

కుల్కచర్ల: అనతికాలంలోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రావడాన్ని జీర్ణించుకోలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల దృష్టిని మరల్చాలనే దేశ ప్రధాని కులంపై వాఖ్యలు చేస్తున్నారని ఉందని కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘణపురం వెంకటయ్యగౌడ్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్యగౌడ్ మాట్లాడుతూ.. కులగణన అట్టర్ ఫ్లాఫ్ అవడంతో పాటు బీసీ సమాజంలో ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతో ప్రధాని మోదీని విమర్శిస్తున్నారని విమర్శించారు. మోదీపై నోరుపారేసుకున్న సీఎం రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ఏ కులమో చెప్పాలని ప్రశ్నించారు. బీసీలకు అన్యాయం చేయడంతో పాటు వారికి ప్రాధాన్యతనిచ్చే నేతలపై వాఖ్యలు చేయడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సి వస్తుందనే ఎన్నికలను వాయిదా వేయించారని ఆరోపించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆంజనేయులు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు మహేశ్ ఉన్నారు.

కల్వర్టును ఢీకొట్టిన కారు

డ్రైవర్‌కు గాయాలు



ఘటనా స్థలంలో కారు

బొంరాస్‌పేట: నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్ కల్వర్టును ఢీ కొట్టాడు. ఈ ఘటన మండల పరిధి జాతీయ రహదారిపై కట్టుకాల్వతండా, చౌదర్‌పల్లి గేటు మధ్య శనివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఒకే కుటుంబానికి చెందిన షారుఖ్, జుబేర్‌లు శంషాబాద్ విమానాశ్రయం నుంచి కర్ణాటకకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు నడుపుతున్న షారుఖ్ రెప్పపాటు కునుకుతో కల్వర్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఆస్పత్రికి, అక్కడి నుంచి పరిగికి తరలించారు.

హోటళ్లలో తనిఖీలు

- నాణ్యత, శుభ్రత పాటించని వారికి భారీగా జరిమానా
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక

శంకర్‌పల్లి: ఆహార నాణ్యత పాటించని హోటళ్లు, బేకరీలపై శంకర్‌పల్లి మున్సిపల్ అధికారుల కొరడా ఝుళిపించారు. శనివారం పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలలో మున్సిపల్ కమిషనర్ యోగేశ్, పర్యావరణాధికారి ఆనంద్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పల్లె రుచులు, మసూల్ దార్ మండి, ఎస్‌వీఆర్ బేకరీలు నాణ్యత పాటించడం లేదని, కిచెన్ నిర్వహణ సైతం సక్రమంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా హోటళ్లలో నిల్వ ఉంచిన అన్నం, చికెన్, అల్లం పేస్టును గుర్తించారు. అనంతరం మసూల్‌దార్ మండికి రూ.30 వేలు, పల్లె రుచులుకు రూ.5 వేలు, ఎస్‌వీఆర్ బేకరీకి రూ.5 వేలు జరిమానా విధించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మార్వడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 9160077916 స్పాట్ క్యాష్. [SCA25001608]

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

WANTED

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA25001686]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించవలసిందిగా ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.